


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### *ఈ టీవీ వాళ్ళు మారనివ్వరు....*

**మా అమ్మమ్మగారి మేనమామ** ఒకాయన, తన పెళ్ళి చూపులకని వెళ్తూ, అక్కడ తొక్కుడు బిళ్ళ ఆడుకుంటున్న అమ్మాయిని "ఫలానా రామప్ప పంతులు గారి ఇల్లు ఎక్కడ?" అంటే "ఎంచక్కా ఎక్కుతారు" అని కిలకిలా నవ్వి, ఆ తర్వాత 'టైం ప్లీజ్' అడిగొచ్చి, ఇల్లు చూపించిన అమ్మాయినే పెళ్ళి చేసుకుంటానని యాగీ చేసి, ఆయన పెళ్ళి చూపులకని వచ్చిన రామప్ప పంతులు గారింట్లోకి వెళ్ళలేదుట.

"అమ్మో అమ్మో ఈ కాలం పిల్లలు ఎంత బరితెగించి పోయారో" అని 1935లోనే పెద్దవాళ్ళు తెగ దవడలు నొక్కేసుకున్నారట. ఆ తర్వాత ఆ పిల్లనే ఆయన పెళ్ళి చేసుకున్నారు. ఆ పిల్ల పేరు శచీదేవి. ఆవిడ మా ముత్తవ్వ వరస. అప్పట్లో పిల్లలకి ఎంచక్కటి పేర్లుండేవి. ఇప్పటిలా 'యామీ', రూహీ', 'కుట్లూ' లాంటి అర్థం పర్థంలేని పేర్లు కావు. వాసవదత్త, వరూధిని, రత్నమాంబ, చంద్రరేఖ, జగద్వందిత, లాంటి పురాణాల్లో పేర్లు పెట్టుకునేవారు. అప్పట్లోనే 'మా ముత్తవ్వ తల్లి పేరు పుల్లమాంబ అని పెట్టను, నా కూతురికి శచీదేవి అని పెడ్తాను అన్న మా ముత్తవ్వ తండ్రి ఎంత ఫార్వర్డో అని ఆలోచిస్తే, తరానికో తరం ఎంతగా మారిపోతోందో తెలుస్తోంది.

1952లలో తీసిన ఫోటో ఒకటి వుంది మా ఆల్బమ్‌లో. అందులో మా అమ్మా, పెద్దమ్మలూ, వాళ్ళ కజిన్స్‌తో కలిసి పంజాబీ డ్రెస్సులలో దిగిన ఫోటో అది. అప్పట్లో మడీ తడీ అంటూ పెద్దవాళ్ళు ఆరు గజాల చీరలూ, పెద్దమనిషి అవగానే, పదకొండేళ్ళ పిల్లలకి ఓణీలూ వేసే రోజుల్లో ఆషాపరేఖ్, నూతన్, తనూజల్లా వీళ్ళు పంజాబీ డ్రెస్సుల్లో వున్న ఫోటో చూసి 'అమ్మమ్మా ఇంత మోడ్రెన్‌గా వుండేవారా తాతయ్యా?"అని అడిగితే "నన్నూ వేసుకోమనేవారు ఆ డ్రెస్‌లు మేం గాంధీగారి ఆశ్రమంలో పనిచేసినప్పుడు" అంది అమ్మమ్మ.

అయినా మాతరం, లంగా ఓణీల్లోనే గడిపాం. ఇప్పుడు పిల్లల పెళ్ళిళ్ళకి తల్లులు ఓణీలు డిజైన్ చేయించుకుని వేసుకుంటున్నారు. "అరెరే.. మీ అమ్మ ఓణీ ఫంక్షన్ అన్నమాట" అన్నాను నేను ఈ మధ్య ఓ పెళ్ళి కూతురి తల్లితో. ఇంకా విచిత్రం మా చిన్నతనంలో వేసుకున్న పొడుగు చేతుల జాకెట్టూ, పరికిణీలు ఇప్పుడు పిల్లల తల్లులు వేసుకుని వ్లాగ్‌లు (VLOGS) పెడ్తున్నారు యూ ట్యూబ్‌లలో. అలా అలా పొట్టి గౌన్లలోకి వెళ్ళిపోయినా ఆశ్చర్యం లేదు. దొరసానులు అని పిలవబడే ఆంగ్లో ఇండియన్స్ కొంతమంది బోయిగూడా సున్నం బట్టీల దగ్గర గుడిశల్లో వుండేవాళ్ళు. ముసలి వాళ్ళుకూడా

పొట్టి గౌన్లు వేసుకుని, సాయంకాలాలు గుడిశల బయట మూడు రాళ్ళ పొయ్యిల మీద వంట చేసుకుంటుంటే మేం 'దొరసానులు' అని విచిత్రంగా చూసేవాళ్ళం. గుడిశలో వున్నా అలాగే అనుకునేవాళ్ళం. నార్త్‌లో వంట వాళ్ళని 'మహరాజ్' అంటారు. "మా మహరాజ్ బైగన్ కా బర్తా చేస్తాడు" అంటే, రాజుగారు కూర చెయ్యడం ఏవిటీ అని ఆశ్చర్యపోతాం.

మన పాత సినిమాల్లో కూడా, వంట వాళ్ళకి తలమీద కిరీటాలలాంటి పాగాలూ, బట్లర్ డ్రెస్సులూ, డ్రైవర్లకి సైతం చక్కని తెల్లటి యూనిఫార్మ్‌లూ వేసేవారు. ఇంక ఆడ పనిమనుషులు అనగానే, వాళ్ళకి లంబాడీ వేషం వేసి, రంగు రంగుల లంగాలూ, ఓణీలూ, నెత్తిమీంచి మేలి ముసుగూ, మెడలో గొలుసులూ చెవులకి మేచింగ్ జూకాలు, మోచేతులదాకా గాజులూ, ఏడుస్తూ వంటగదిలోనో, తులసి కోట దగ్గర్లోనో వుండే హీరోయిన కన్నా వీళ్ళ అటైర్ బావుండేది.

ఇంతకీ నేను చెప్పేదేవిటంటే 1935 నుండే 'ఈ కాలం పిల్లలు ఫాస్ట్, బరితెగించేస్తున్నారు' అనుకునేవాళ్ళు.

పిలకలూ, పంచెలూ తీసేసి 1940లలో, బుష్‌కోట్లూ, టెర్లిన్ ఫ్యాంట్‌లూ వేసుకుంటే మగవాళ్ళని షోకిల్లా రాయుళ్ళు, అనో జల్సా రాయుళ్ళు అనో అనేవారుట. 1965లలో వచ్చిన సినిమాలలో ఆడపిల్లలు సైకిల్ పై వన్నెలాడీ పోతున్నదీ' అని జోరుగా సైకిల్ మీద బి. సరోజలు స్కూళ్ళకీ, కాలేజీలకీ వెళ్ళడం చూపించేవారు. అంతేకాదు 'కారులో షికారుకెళ్ళే పాల బుగ్గల పసిడీ చానా" అంటూ క్రిష్ణకుమారిలూ, రాజ సులోచనలూ కారు డ్రైవ్ చేసేవారు. 'జాగ్ తే రహో' అన్న పాత సినిమాలో నాదిర, సిగరెట్ హోల్డర్‌లో పెట్టి, ఇంత పొడుగున ఎంత స్టైలుగా సిగరెట్ తాగడం చూపిస్తాడో రాజ్‌కపూర్.

అప్పటి పుస్తకాలు చదివినప్పుడూ, సినిమాలు చూసినప్పుడూ, అప్పట్లో వాళ్ళని ఏలిన తెల్లవాళ్ళ ప్రభావం, దొరసానుల సింగారం వీళ్ళల్లోనూ ఎక్కువగా కనపడేది అనుకుంట. వాళ్ళు దేశాన్ని వదిలి వెళ్ళిపోయాక మనమూ, మన కచ్చా పోసి కట్టుకున్న ఆరుగజాల చీరలూ మిగిలాయి మళ్ళీ. ఇప్పటి ఫేస్‌బుక్‌ల్లో, వ్లాగ్‌ల్లో, ఇన్‌స్టాగ్రాంలలో పొట్టి గౌన్లు వేసుకోవడానికి, పిల్లల తల్లులకి ఇన్ని శతాబ్దాలు ఆగవలసి వచ్చింది. 1960ల నుండీ జెనరేషన్ చాలా స్లో అయిపోయింది. ఇంత గాట్టిగా ఎలా చెప్పగలిగానంటే నేను 65లో పుట్టడం వల్ల.

నాకు ఏడు, ఎనిమిదేళ్ళు వచ్చేసరికే నేను నవలలు చదవడం మొదలుపెట్టాను అంటే అతిశయోక్తి కాదు. నూటికి నూరుపాళ్ళూ నిజం. అర్థం అయినా కాకపోయినా, ఇంట్లో అమ్మలు చదివే, వారపత్రికలలోని కుట్టిన సీరియల్స్, దీపావళి ప్రత్యేక సంచిక యువ, జ్యోతీ, అన్నీ చదివేసేదాన్ని. పదకొండో ఏట 'కవితా బి.ఏ' అని నవల రాయడం మొదలు పెట్టి, అందులో 'విష్ణుమూర్తి, కవితని ప్రేమించేసాడు. అందుకని ఎర్ర రిబ్బన్లూ, పాల ఐస్ ఫ్రూట్లూ కొని పెట్టాడు' అని రాస్తే మా పెద్దమ్మ కూతురు చూసి, మిగతావాళ్ళకి చూపించి, పెద్ద పెంట చేసెయ్యడం, 'ప్రేమించడం' అంటే అప్పుడే తెలిసిపోయిందా? అని అమ్మమ్మ నా నడ్డిమీద రెండు అంటించడంతో అలిగి రాయడం మానేసాను. అందుకే కసిగా ప్రేమ నవలలు రాసి పారేస్తుంటాను.

"ఏదీ మా అమ్మమ్మని ఇప్పుడొచ్చి నా నడ్డి మీద అంటించమనండి చూద్దాం."

అసలు ఎంత స్లోగా వుండేవంటే నవలలు అతను ఆమెని "నీ మనసులో నన్ను కలవాలని కోరిక వుందని నాకు చెప్పాలన్నట్లు చూస్తున్నావని, నాకు తెలుసులే" అన్నట్లు  చూసాడు.

"మా నాన్న నన్ను నీకిచ్చి పెళ్ళి చెయ్యాలంటే, నువ్విలా బొమ్మలూ, గీతలూ గియ్యడం కాదు బావా మంచి గర్నమెంట్ ఉద్యోగం, గవర్నమెంటే కారునీ, బంట్రోతునీ ఇచ్చేలాంటి ఉద్యోగం వుండాలి సుమా" అన్నట్లు ఆమె చూసింది.. ఇంత పెద్ద పేరాగ్రాఫ్ చూపుల్లో చెప్పడం సాధ్యమా?

ఇలా చూపుల అర్థాలు వెతుక్కుంటూ ఆమె వరండా స్తంభం చాటునా, అతను వీధి దీపం స్తంభం కిందా నిలబడి ప్రేమించుకునేవారు. ప్రేమంటే అంతే అనుకుని నేనూ బస్‌స్టాప్‌లో కొంతమందినీ, బస్‌లో వెళ్తూ ఒకరిద్దరినీ, సినిమా హాలు క్యూలో నిలబడ్డప్పుడు, చాలా మందినీ, రైలు ప్రయాణాల్లో అథవా ఒకరినైనా ప్రేమించేసేదాన్ని. అది ప్రేమ కాదని తెలిసేటప్పటికే నిజం ప్రేమలో పడిన అతనితో పెళ్ళయిపోయిందనుకోండీ.

ఇంకో విషయం నాకు అర్ధకానిది, పాత సినిమాల్లో, వేగంగా అపార్ధాలు చేసుకుంటారు. 'డెడ్ స్లో'గా నిజాలు తెలుసుకుంటారు.

అబ్బాయిని అమ్మాయిని స్తంభం చాటునుండి ఇవతలకొచ్చి చూడడానికి పదిరేళ్ళ కాలం పట్టాక, ఒక చిన్న ఇన్సిడెంట్, ఆమె ఇంటిముందు పడిపోయిన అతన్ని లోపలికి తీసుకొచ్చి పడుకో పెడ్తుండగా హీరో వచ్చి, "ఛీ కులటా! నువ్వు అపవిత్రం అయిపోయావు. ఎంతకాలంగా సాగుతోందీ రంకు.. పో తప్పుడు ముండా" (సెన్సార్ నిషేధాలు లేవు ఆడవాళ్ళని తిట్టేటప్పుడు అప్పట్లో) అని తన్ని తగలేస్తాడు హోరున కురిసే వానలోకి ఆమెని. ఆమె ఏం చెప్పాలని ప్రయత్నించిన, వినడు.

ఆమె అలా పట్నంలో ఎండలో, వానలో నడుస్తూనే, రోజులు తరబడి చివరికి చాలా పెద్దకారులో వచ్చే పెద్ద మనసున్న మహాత్ముడి కారు కింద పడిపోతుంది. ఆయనకి చచ్చేటంత ఆస్తీ, లంకంత బంగళావుండి, తినేవాళ్ళు లేక, ఈమెని కూతురిగా దత్తు తీసుకుని, ఈమెకి పుట్టిన వాడిమీద అలవికాని ప్రేమని పెంచుకుంటాడు. అక్కడ మొగుడు డాన్సింగ్ గర్ల్ మోజులో పడి, డబ్బంతా పోయి రోగాల పాలయి ఈ పెద్దాయన ఫ్యాక్టరీలో కూలికి చేరతాడు. క్షయవ్యాధి వస్తుంది. ఈమెకి పుట్టిన కొడుకుతో స్నేహం అయి, నాకూ ఇంత కొడుకుండేవాడు నా దేవతని వెళ్ళగొట్టకపోతే' అనుకుంటాడు. (చైల్డ్ సెంటిమెంట్‌తో కర్చీఫ్‌లూ, ఆడవాళ్ళ కొంగులూ తడిసిపోవాలి)

ఓ శుభ ముహూర్తాన ఆమె అన్నదానం చేస్తుంటే, బికారిలా వెళ్ళి, క్యూలో ఆకు పట్టుకుని నిలబడ్తాడు దేభ్యం మొహం వేసుకుని.. "నాధా మీరా?" అని స్పృహ తప్పి పడిపోతుంది. ఆ తర్వాత కాళ్ళమీద పడి "మీ పాద ధూళి కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నా" అంటూంది.

ఇద్దరూ కలసి "సంసారం సంసారం ప్రేమ సుధా సారం.." అంటూ పిల్లాడితో పాట. ఎన్ని చూడలేదూ.

అవే బేస్‌గా టీవీ సీరియల్స్ రాసాం. ఇంకా రాస్తున్నారు. బెల్‌బాటమ్‌లూ, టోర్న్ జీన్స్ వేసుకున్నా ఇల్లేకదా స్వర్గ సీమా.. ఇంటి లక్ష్మీ.. ఆషాఢ దీపం.. ఇంటికి ట్యూబ్ లైట్ ఇల్లాలే.. ఇలాంటి ముగింపులే వుంటాయి.

అసలు డాన్సింగ్ గర్ల్‌తో పోయినోడు తిరిగొస్తే, ఈవిడ ఆయన కాళ్ళు పట్టి దుమ్ము తీసుకోవడం ఎందుకు? అతను కాళ్ళు పట్టుకుంటే దులపరించుకుపోక. అందుకే 1965నుండీ 'స్లో' అన్నాను. నా లాంటిది. ఇలాంటి కథలు చెప్పినా, ఆవిడ ఈ త్రాష్టుడ్ని వదిలి వేరే పెళ్ళి చేసుకుని వెళ్ళిపోయింది అని. 'ఏంటీ సెంటిమెంట్' అంటారు. జనం అంగీకరించరు అంటారు. ఏం జనం? మీరైతే ఆ ఒళ్ళంతా జబ్బువాడితో, ఇప్పటి రిలయన్స్ ఓనర్ అయిన ఆర్థిక స్థితిలో వున్న జమిందారిణికి, ఈయన పాదాలకి అంటుకున్న ధూళితో ఏం పని? దుమ్ము ఫ్యాక్టరీనే కొనెయ్యగలదు కావాలంటే అనద్దూ? హూ ఏంటో ఈ పతివ్రతా సెంటిమెంట్ ఆడోళ్ళని అమ్మోర్లని చేస్తుంది. గుడిలో ఇనప కటకటాల వెనుక పెట్టి టైం ప్రకారం హారతులివ్వడానికి అంతే కానీ స్వేచ్ఛగా విడిచిపెట్టి 'స్త్రీ శక్తులు'గా చెయ్యడానికి కాదు. ఈ భావజాలాన్ని ఇప్పటికైనా తాళం పెట్టి భూస్థాపితం చేసి ఆడపిల్ల పుట్టగానే బయట స్వేచ్ఛగా తిరుగు. ఏదైనా మృగం కనిపిస్తే చీల్చి చెండాడు. మీద చెయ్యేస్తే చంపెయ్. లేదా చంపేవాళ్ళని పిలు... అని చెప్పండిరా.. బనావ్ షేర్నీ.

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4